# సజావుగా పోలింగ్

- పోటెత్తిన ఓటర్లు
- పట్టణాల నుంచి పల్లెలకు తరలివచ్చిన జనం
- మాల్ మండలం కిష్టరాయినిపల్లిలో ఇరువర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ



దేవరకొండ: కమలాపురంలో ఓటేసేందుకు బారులు దీరిన ఓటర్లు

దేవరకొండ, నవంబర్ 30: అసెంబ్లీ ఎన్నికలకు ఓటర్లు పోటెత్తారు. నియోజకవర్గంలో ఉదయం పోలింగ్ మందకొడిగా ప్రారంభం అనంతరం పుంజుకున్నది. మధ్యాహ్నం తర్వాత ప్రజలు ఒక్కసారిగా పోలింగ్ కేంద్రాలకు చేరారు. ఓటేసేందుకు క్యూలైన్లలో బారులు దీరారు. పట్టణాల్లో ఉన్న ప్రజలు ఓటు వేసేందుకు పల్లెలకు తరలివచ్చారు. దీంతో పోలింగ్ శాతం పెరిగింది. హైదరాబాద్, గుంటూరు, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేవరకొండ నియోజకవర్గంలో చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, కొండమల్లేపల్లి, పీఏపల్లి, దేవరకొండ, చింతపల్లి మండలాల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 4గంటల వరకు 65 శాతం పోలింగ్ శాతం పెరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నాయకులు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు పాట్లు పడ్డారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లకు ప్రధాన పార్టీల నాయకులు మద్యం, డబ్బులు ఎర చూపారు. దేవరకొండ పట్టణంలో కొందరికి డబ్బులు అందాయని ఒక వార్డులో మహిళలు మేము ఓటేయమని బీష్మించారు. ప్రధాన పార్టీల నాయకులు అక్కడకు చేరుకొని ఓటర్లను సర్ది చెప్పి పోలింగ్ కేంద్రాలకు పంపించారు.

## 50 పోలింగ్ కేంద్రాల్లో ...

మాల్: చింతపల్లి మండల వ్యాప్తంగా 50పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చింతపల్లి మండలంలోని గొల్లపల్లిలో మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్మన్ కంకణాల ప్రవీణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం ఓటర్ల సంఖ్య 42062 మంది ఓటర్లు ఉన్నారు. 36615 ఓట్లు పోల్ కాగా 87.45 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని కిష్టరాయినిపల్లిలో సాయంత్రం ఇరువర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. పోలీసులు రంగంలోకి దిగడంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ఆర్ఓ షంషుద్దీన్ తెలిపారు.

## బూడిదగట్టుతండాలో రెండు పోలింగ్ స్టేషన్లు

పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి మండలంలో తొలి సారిగా మారుమూల గ్రామంగా పేరున్న బూడిద గట్టుతండాలో రెండు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్ నెం.298/ఏలో 92.3శాతం ఓటింగ్ నమోదు కాగా మొత్తం 130 ఓటర్లకు గాను 120 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 63 మంది కాగా స్త్రీలు 57 మంది ఉన్నారు. బూడిదగట్టులోని పోలింగ్‌స్టేషన్ నెం.297/ఏలో వంద శాతం ఓటింగ్ నమోదైంది.

## ఉత్సాహం చూపిన ఓటర్లు

చందంపేట : ఉమ్మడి చందంపేట మండలంలో గురువారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మారుమూల గ్రామాల్లో సైతం ఓటర్లు ఉత్సాహం చూపి ఓటు వేసేందుకు ముందుకొచ్చారు. మండలంలోని 43 పోలింగ్ కేంద్రాలకు 230 పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించినట్లు తహసీల్దార్ రాములు తెలిపారు.

## ఓటేసిన వృద్ధులు, దివ్యాంగులు

గుడిపల్లి : మండలంలో గురువారం సాధారణ ఎన్నికలలో ఓటు వేసేందుకు ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ బూత్‌లకు తరలివచ్చారు. నూతన మండలంగా ఏర్పడిన గుడిపల్లి మండల కేంద్రంలో నూతన ఓటర్లతో పాటు వృద్ధులు, దివ్యాంగులు ఓటేసేందుకు వచ్చారు.

## ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం

డిండి: మండలంలో 50 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగానే ఓటర్లు ఉత్సాహంగా ఓటేసేందుకు బారులు తీరారు. గోనబోయినపల్లిలో పోలింగ్ ముగిసే సరికి 150మంది ఓటర్లు క్యూలైన్‌లో ఉన్నారు.



చింతపల్లి: గొల్లపల్లిలో ఓటేసేందుకు క్యూలో నిలబడిన మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్మన్ కంకణాల ప్రవీణావెంకట్‌రెడ్డి



పెద్దఅడిశర్లపల్లి: బూడిదగట్టుతండాలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి



చందంపేట: పోలేపల్లిలో బారులు దీరిన ఓటర్లు



దేవరకొండ:కొండభీమనపల్లిలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడ్డ యువత



చందంపేట: ముడుదండ్లలో ఓటేసేందుకు ట్రై సైకిల్‌పై వస్తున్న దివ్యాంగురాలు



గుడిపల్లిలో ఓటేసేందుకు బారులు దీరిన మహిళా ఓటర్లు

# బీఆర్ఎస్ పార్టీదే విజయం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

- ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, నవంబర్ 30: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఈ సారి కూడా బీఆర్ఎస్ పార్టీదే విజయమని ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం హాలియా మున్సిపాలిటీలోని ఇబ్రహీంపేటలో గురువారం ఎమ్మెల్యే భగత్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటే వజ్రాయుధం అని అన్నారు. ఓటర్లు తమకు నచ్చిన నాయకుని ఎన్నుకునేందుకు ఓటు హక్కు ద్వారా వీలు కలుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మూడోసారి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఓటర్లు ఆలోచించి పనిచేసే ప్రభుత్వానికి ఓటేసి అభివృద్ధికి పట్టం కట్టాల్సిందిగా ఆయన కోరారు. ఆయన వెంట యడవల్లి మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.



పెద్దవూర: తుంగతుర్తిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీబీపీ డీఎస్పీ అర్జున్ సింగ్



పెద్దవూర: పర్వేదులలో ఓటేసేందుకు క్యూలైన్‌లో నిలబడ్డ ఓటర్లు



గుర్రంపోడు: చామలోనిబావిలో ఓటు హక్కు వినియోగించుకున్న పుష్ప సినిమా ఫేం తిరందాస్ నాగరాజు (మొగిలేస్)



పెద్దవూర: పిన్నవూరలో ఓటేసిన మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నప్‌రెడ్డి



నందికొండ: పోలింగ్ కేంద్రం వద్ద వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

# కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ

- ఆరుగురికి గాయాలు

చందంపేట, నవంబర్ 30: మండలంలోని కోరుట్ల గ్రామంలో పోలింగ్ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగింది. కాంగ్రెస్‌కి చెందిన జాలె నర్సింహారెడ్డికి కోరుట్ల సర్పంచ్ మల్లారెడ్డికి మధ్యాహ్నం స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో నర్సింహారెడ్డి సోదరుడు జాలె తిలక్‌రెడ్డి, మరికొందరు సాయంత్రం గ్రామానికి వెళ్లగా వారిపై దాడి చేశారు. ఈ దాడిలో తిలక్‌రెడ్డితో పాటు మరో ఐదుగురికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని దేవరకొండలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.